డెయిరీ ద్వారా మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం




ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 12 జూన్, 2026 | పేజీలు : 06

## నూతన ఏరియా ఆసుపత్రిని త్వరగా

# అందుబాటులోకి తీసుకురావాలి

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన మౌలిక వసతులతో త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం పరకాలలో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా రూ.79.18 లక్షల వ్యయంతో వైద్య పరికరాల కొనుగోలు, అత్యవసర మందుల నిల్వలు, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు.ప్రస్తుతం ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల సంఖ్య, ప్రతిరోజూ వైద్య సేవల కోసం వచ్చే రోగుల వివరాలు, నెలవారీ ప్రసవాలు, శస్త్రచికిత్సల సంఖ్య, మందుల నిల్వలు, నూతన ఆసుపత్రికి అవసరమైన అదనపు పరికరాలు, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల గణాంకాలు, ఆసుపత్రి పరిధిలోని మండలాల వివరాలను ఎమ్మెల్యే సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. బిల్లులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై సూపరింటెండెంట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల ఏరియా ఆసుపత్రి ద్వారా ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా అనస్థీషియా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన అన్ని మందులు ఆసుపత్రిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు.గత నెలలో నూతన ఏరియా ఆసుపత్రిని సందర్శించి, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన ప్రతి రశీదు, బిల్లు, రికార్డును పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనులను సంబంధిత ఏజెన్సీలు వేగవంతంగా పూర్తి చేసి ఆసుపత్రిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.అదేవిధంగా పరకాలలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవన సముదాయం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల సంఖ్య, శస్త్రచికిత్సలు, ప్రసవాల గణాంకాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్వహణ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బాలకృష్ణ, నాగరాణి, రాఘవరెడ్డి, పుష్పలత, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల నర్సింగ్ హోమ్‌పై

# వైద్యాధికారుల ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని తిరుమల నర్సింగ్ హోమ్‌లో అనుమానాస్పద గర్భాశయ శస్త్రచికిత్స జరిగినట్లు అందిన సమాచారంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ గురువారం తన బృందంతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా లావుడియా జ్యోతిక (భర్త గణేష్) పుల్లయ్యబోడు తండా చెన్నారావుపేట మండలానికి చెందిన కేసును సంబంధించిన రికార్డులు కేసు షీట్లు ఇతర సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత కేసు మహబూబాబాద్ జిల్లా పరిధికి చందక వరంగల్ జిల్లా పరిధిలో ఉండటంతో పూర్తి వివరాల కోసం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.విచారణ పూర్తయ్యే వరకు ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేసినట్లు సచాచారం కాగా ఈ ఘటనపై స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తిరుమల నర్సింగ్ హోమ్ వైద్యుడు గత అనేక సంవత్సరాలుగా గూడూరు మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ధరల్లో వైద్యం అందించడంతో పాటు పేద రోగులకు ఉచితంగా సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందారని స్థానికులు పేర్కొంటున్నారు.ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తున్నందున కొందరు వ్యక్తులు కావాలనే తప్పుడు సమాచారాన్ని అధికారులకు చేరవేసి వైద్యుడి ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

**తప్పుడు సమాచారంతో ఆసుపత్రి ప్రతిష్ఠను దిగజార్చొద్దు : తిరుమల నర్సింగ్ హోమ్ డాక్టర్ సురేందర్**

తప్పుడు సమాచారంతో ఆసుపత్రి ప్రతిష్టను దిగజారిచొద్దని డాక్టర్ సురేందర్ అన్నారు.గురువారం ఆయన మీడియా ఈఘటనపై వివరణ కోరుగా తాను గూడూరు ఏజెన్సీ ప్రాంతంలో ఎంతో మంది పేదలకు ఫీజులు తీసుకోకుండా వైద్య చేయడం జరిగిందని ఓపి విభాగంలో పేదవారికి ఉచితంగా వైద్యం అందించామని అన్నారు. అదేవిధంగా కోర్పోరేట్ స్థాయిలో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుంటున్న తాను మాత్రం పేదలకు సేవ చేసే ఉద్దేశంతో అందుబాటు ధరల్లోనే ఎంతో మందికి వైద్యం అందించాలని అన్నారు.మండలంలో ఎంతో మందికి ఉచిత వైద్య లు చేశాను పేదవారంటే చాలామందికి డబ్బులు తీసుకోకుండా వైద్యం చేశారని అన్నారు

# సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

**ప్రజాపక్షం/జనగామ :** సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు చేపట్టాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీస్‌కుమార్ ఝా అన్నారు. పారశుద్య పనులకు ప్రధాన్యత ఇవ్వాలని పక్కాగా డ్రైడేగా ఫ్రైడే నిర్వయించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో గురువారం జనగామ జిల్లా కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్స్ హాల్‌లో సీజనల్ వ్యాధులపై జిల్లా అధికారులతో సమన్వయ కమిటి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వాధ్యుల నివారణకు అన్ని శాఖలు సమన్యయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వ్యాధుల కేసులు పెరిగే అవకాశాలు ఉన్నందున ముందస్తు నివారణ చర్యలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జ్వరాల పట్ల ప్రత్యేక దృష్టి సారంచాలని, ప్రతి గ్రామంలో ఇంటింట ఫీవర్ సర్వే నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించిఇ వెంటనే వైద్య సేవలు అందించాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వార్డులో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస పారిశుద్య కార్యక్రమాలు పర్యవేక్షంచాలన, మున్సిపాల్టీలోని 30 వార్డులను మూడు క్లస్టర్లుగా పది వార్డుల చొప్పున విభజించి బాధ్యతులు అప్పగించాలన్నారు. మురుగు కాల్వలోల్మ చెత్తా పేరుకుపోకుండా ఎప్పటకప్పుడు శుభ్రపరిచి నీటి ప్రవాహం సజావుగా ఉండేలా చూడాలన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కమ్యూనిట సోక్ పిట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, రహదారుల పక్కన చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో నిర్వయించే పారిశుద్య కార్యక్రమాలకు సంబంధించిన లాగ్‌బుక్స్ సక్రమంగా నిర్వయించాలన్నారు. ఇందులో అందరు బాగ స్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి మల్లికార్జున్‌రావు, ఎంసిహెచ్ సూపరిండెంట్ రాజలింగం, డిఆర్‌డిఓ భాస్కర్, విద్యాశాఖ ఇంచార్జీ ఎడి శ్రీనివాస్, డిపిఓ వెంకట్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ కమిటి చైర్మన్ తవుటం ఝాన్సీ రవీందర్‌కు నారి శక్తి అవార్డు




**ప్రజాపక్షం /కమలాపూర్:** భారతదేశ సేవారంగంలో అగ్రగామిగా ఉండబడిన భారత్ కి అన్మోల్ సంస్థ వారు భారతదేశంలో వివిధ రంగాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న మహిళలను ఎంపిక చేసి హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్ మేరీ గోల్డ్ వేదికగా తెలంగాణ నుండి కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ కి రాజకీయ, రైతు సేవ విభాగం కింద నారి శక్తి అవార్డు ప్రధానం చేయనైనది. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాలతో పాటు రాజకీయ రంగంలో కూడా పురుషులతో సమానంగా అగ్రగామిగా నిలబడాలని కోరనైనది. నా యాక్టివిటీస్ ని గుర్తించి దేశవ్యాప్తంగా 40 మంది మహిళలతో పాటు నన్ను ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో ఝాన్సీ రాణి రవీందర్ కి కమలాపూర్ మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, పద్మశాలి కుల బంధువులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## మురుగులో మునిగిన సమస్యలు...బిందెలతో నీటి వేట!

**ప్రజాపక్షం/నెక్కొండ:** మండలంలోని పత్తిపాకలో ఒకవైపు రోడ్లపైకి పొంగిపొర్లుతున్న మురుగు నీరు...మరోవైపు తాగునీటి కోసం బిందెలతో తిరుగుతున్న మహిళలు. ఇదే ప్రస్తుతం పత్తిపాక గ్రామ ప్రజల దైనందిన జీవన చిత్రం. కాలువలు శుభ్రం కాక మురుగునీరు వీధుల్లోకి చేరుతుండగా, దుర్వాసనతో పాటు దోమల బెడద ప్రజలను వేధిస్తోంది. తాగునీటి సరఫరా సక్రమంగా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పరిష్కారం కనిపించకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గ్రామాభివృద్ధి మాటల్లో కా దు. .ప్రజల ఇళ్ల ముందు నిలిచిన మురుగు నీరు తొలగినప్పుడే కనిపించాలని గ్రామస్తులు అంటున్నారు. వర్షాకాలం మరింత తీవ్రం కాకముందే అధికారులు స్పందించి మరింత తీవ్రం కాకముందే అధికారులు స్పందించి డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గూడూరులో తాటి, ఈత వనం దగ్ధం



**ప్రజాపక్షం/ కమలాపూర్:** కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తుల నిర్లక్ష్య చర్య వల్ల ఈత, తాటి వనం, మామిడి తోట అగ్నికి ఆహుతయ్యాయి. పొలాల్లోని వరి కొయ్యకాలను తగలబెట్టడం వల్ల రేగిన మంటలు ప్రక్కనే ఉన్న తాటి వనానికి వ్యాపించి భారీ నష్టం మిగిల్చాయి. గ్రామ శివారుల్లో ఉన్న తాటి, ఈత వనంలో సుమారు 40 వరకు తాటి, ఈత చెట్లు కాలి బూడిదయ్యాయి. అందులో కల్లు పారుతున్న చెట్లు కూడా ఉన్నాయని, గౌడ సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో గౌడ సంఘానికి సంబంధించిన మామిడి తోటలో దాదాపు 60 చెట్లు మంటల్లో దగ్ధమయ్యాయి. ఏళ్ళుగా పరిరక్షించుకుంటున్న ఈ వనం, తోట క్షణాల్లో నాశనం కావడంతో గ్రామ గౌడ కులస్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఘటన గుర్తించిన వెంటనే, గౌడ సంఘం సభ్యులు పైప్ లైన్ల ద్వారా నీటిని తెచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే నష్టం జరిగిపోయింది. ఈ ఘటన పై గూడూరు గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు కొండపాక రవి మాట్లాడుతూ... పంట వ్యర్థాలను నిర్లక్ష్యంగా తగలబెట్టడం వల్ల ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇకపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. నష్టపోయిన తాటి, ఈత, మామిడి తోటకు ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విబిజి రామ్‌జి పథకం రద్దుచేసి ఎంజినరేగాను పునరుద్ధరించాలి

### కేంద్ర ప్రభుత్వపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఒత్తిడి తేవాలి

### బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి కూలీల ప్రయోజనాలను దెబ్బతీసే విబిజీ రామ్ జిని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి అమలు జరపాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు వ్యతిరేకిస్తున్న ఈ నూతన పథకాన్ని జూలై 1 నుండి అమలు జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించకుండా నూతన ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించవద్దని, ప్రస్తుతము జరుగుతున్న పనులన్ని పూర్తయ్యే వరకు 100శాతం నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలని, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేసిన డిమాండ్ ను కేంద్ర ప్రభుత్వం పరిగణన లోకి తీసుకోవాలన్నారు. కేంద్రం తెచ్చిన కొత్త పథకాన్ని రద్దుచేసి యంజీ నరేగాను పునరుద్ధరించి అమలు జరపాలని ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వంపై వెంటనే ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలు గ్రామీణ పేదలు చైతన్యంతో సంఘటితమై ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణ కోసం, సంవత్సరంలో 200 రోజులు పని, రోజుకు రూ. 700 కూలి, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ. 6000 పెన్షన్ తదితర డిమాండ్స్ సాధనకై వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమితి పిలుపునుసరించి జూన్ 23 న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ప్రదర్శనలు, ధర్నాలలో గ్రామీణ శ్రమజీవులు పెద్ద ఎత్తున పాల్గొని కార్మిక ప్రజా వ్యతిరేక పాలకులపై సమర శంఖం పూరించాలన్నారు.

## ముల్కనూర్ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను సందర్శించిన ఆర్టీసీ

### బస్ స్టేషన్ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి గురువారం సందర్శించారు. బస్ స్టేషన్‌లోని మౌలిక సదుపాయాలు,ప్రయాణికులకు అందుతున్న సేవలను పరిశీలించిన ఆయన, బస్ స్టేషన్‌ను ఆధునిక హంగులతో అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులతో మాట్లాడిన నాగిరెడ్డి, ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బస్ స్టేషన్ అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, మాజీ ఎంపీపీ అశోక్ ముఖర్జీ, మాజీ మండల అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్, యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ చిటుకూరి అనిల్, గణవేన కొమురయ్య, చిటుకూరి నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాకీ సేవకు గుర్తింపు....హెడ్ కానిస్టేబుల్ వెంకన్నకు పదోన్నతి



**ప్రజాపక్షం/నెక్కొండ:** విధి నిర్వహణలో నిబద్ధత, ప్రజలతో మమేకమైన సేవాభావానికి గుర్తింపుగా నెక్కొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కార్లకుంటి వెంకటేశ్వర్లు(వెంకన్న)కు ప్రభుత్వం హెడ్ కానిస్టేబుల్ హోదాతో పదోన్నతి కల్పించింది. ఈ సందర్భంగా నెక్కొండ పోలీస్‌స్టేషన్ ఆవరణ అభినందనలతో కళకళలాడింది. స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పోలీస్ సిబ్బంది వెంకన్నకు శుభాకాంక్షలు తెలిపారు. సహచరుల మధ్య సౌమ్య స్వభావం, ప్రజల పట్ల మర్యాదపూర్వక వ్యవహారంతో ప్రత్యేక గుర్తింపు పొందిన వెంకన్న పదోన్నతి స్థానికంగా ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పదోన్నతి గౌరవం మాత్రమే కాదు. నా భుజాలపై మరింత బాధ్యతను ఉంచింది. ప్రజలకు మరింత అంకితభావంతో సేవలందిస్తానని అన్నారు. స్టేషన్ ఎస్ఐ మహేందర్‌తో పాటు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ అక్బర్, బానోత్ రమేష్, నరేష్ రెడ్డి, మంజుల, వినీత, హోంగార్డు సుందరయ్య, చిన్న నాయక్, వెంకన్నను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఖాకీ దుస్తుల్లో క్రమశిక్షణకు, సేవా తత్వానికి దక్కిన ఈ గుర్తింపు నెక్కొండ పోలీస్ కుటుంబానికి గర్వకారణంగా నిలిచింది.

## సిసి మోహన్ మృతి పట్ల సంతాపం

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం దీక్షకుంట సెక్టార్ సిసిగా విధులు నిర్వహిస్తున్న మోహన్‌బాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందడం పట్ల సహచరులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న ఏపిఎం కిరణ్, పలువురు సిసిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోహన్‌బాబు సేవాభావం కలిగిన వ్యక్తిగా, విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన సహోద్యోగిగా గుర్తిండిపోతారని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆ భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థించారు. మోహన్‌బాబు అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన సంగెంలో మధ్యాహ్నం అనంతరం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల నెక్కొండ మండల వ్యాప్తంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**ప్రజాపక్షం/రాయపరి:** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఈదులకంటి రాంరెడ్డి ఇటీవల ఆనారోగ్యంలో మరణించగా గురువారం బాధిత కుటుంబాన్ని బిఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పంపించిన 50 కెజిల బియ్యం, ఆయిల్ క్యాన్‌ను బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, లేతకుల రంగారెడ్డి, ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, గబ్బేట యాకయ్య, సంది దేవేందర్ రెడ్డి, పెరటి యాదవరెడ్డి, ఈదులకంటి సంపత్ రెడ్డి, గుడెల్లి వెంకటయ్య, రవి, కోలా సంపత్, కోలా కొమురయ్య, పట్టపురం బిక్షపతి, గన్నరం యాకయ్య, ఎనగందుల మహేందర్, బైరు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మాదన్నపేటలో బెల్ట్ షాపులను మూసివేయాలి

**ప్రజాపక్షం/ కమలాపూర్:** కమలాపూర్ మండలంలోని మాదన్నపేట గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు కలిసి బెల్ట్ షాపులు నివారించడం వల్ల గ్రామంలో శాంతి భద్రతలు మెరుగుపరచడమే కాకుండా, కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబ సభ్యులు సంతోషంగా జీవించే అవకాశం ఉందని భావిస్తూ గ్రామ సర్పంచ్ కత్తి రమేష్ కి బెల్ట్ షాపులను పూర్తిగా నివారించడానికి వినతి పత్రాన్ని మహిళలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు రజిత, సభ్యులు అశ్విని, లతా, శ్రీలత, భాగ్య, వినోద, స్వరూప, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## వరంగల్‌లో డిగ్రీ మైనారిటీ కాలేజీ స్థాపించాలి



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఉమ్మడి వరంగల్ జి ల్లాలో మైనారిటీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం వెంటనే ప్రభుత్వ మైనారిటీ డిగ్రీ కళాశాలను ఏ ర్పాటు చేయాలని తురక కాశ సంక్షేమ సంఘం (టీకేఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వలి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జి ల్లా వ్యాప్తంగా వందలాది మంది పేద మైనారిటీ బా లబాలికలు ఇంటర్మీడియట్ పూర్తి చేసినప్పటికీ, జి ల్లాలో ప్రత్యేకంగా మైనారిటీ డిగ్రీ కళాశాల అందుబాటులో లేకపోవడంతో పైచదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్థోమత లేక, ప్రైవేట్ కళాశాలల్లో చేరలేక చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారని పేర్కొన్నారు.మైనారిటీ విద్యార్థుల విద్యాభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని, వా రి చదువుపై చిన్నచూపు చూడటం సరికాదని సయ ్యద్ వలి హితవు పలికారు. విద్యా హక్కు అందరికీ సమానమేనని, పేద మైనారిటీలకు ఉన్నత విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మంత్రులు చొరవ చూపాలి రాబోయే 2026/27 విద్యా సంవత్సరంలోనే వరంగల్ జిల్లాలో మైనారిటీ డిగ్రీ కళాశాల ప్రారంభమయ్యేలా పాలకులు చర్యలు చేపట్టాలని,ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క (ధనసరి అనసూయ)లు ఈ విషయంపై ప్రత్యేక చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రులు స్పందించి తక్షణమే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు నిధులు, అనుమతులు మంజూరు చేయిస్తే, వందలాది మంది మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేసినవారైతారని సయ్యద్ వలి అన్నారు.

## దప్పు చప్పళ్లతో బడిబాట ప్రచారం

**ప్రజాపక్షం/గూడూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలంలోని పాటిమీది గూడెం గ్రామంలో వినూత్న అవగాహన కార్యక్రమం చేపట్టారు. గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు డాక్టర్ వి గోపీనాథ్ స్వయంగా దప్పు వాయిస్తూ గ్రామ వీధుల్లో తిరిగి ప్రజలను ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరించి ఆయన రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం క్రీడా సౌకర్యాలు ఆధునిక బోధన విధానాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.పిల్లల శారీరక మానసిక వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు తల్లిదండ్రులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యపై అవగాహన పెంచేందుకు ఉపాధ్యాయుడు డాక్టర్ వి గోపీనాథ్ చేపట్టిన ఈ వినూత్న ప్రయత్నాన్ని స్థానికులు అభినందించారు.

## 15న విద్యాసంవత్సరం పండుగ వాతావరణంలో ప్రారంభించాలి

**ప్రజాపక్షం/మహబూబాబాద్/కురవి:** ఈ నెల 15నుంచి ప్రారంభం కానున్న విద్యాసంవత్సరం జిల్లాలోని 16 కెజిబివిల్లో పండుగ వాతావరణంలో ప్రారంభించాలని, విద్యార్థినులకు ఘనంగా స్వాగతం పలకాలని మహబూబాబాద్ జిసిఇఒ యద్దనపూడి గాయత్రి ఎస్ఒలకు సూచించారు. బుధవారం మహబూబాబాద్, కురవి మండలం నేరెడ కెజిబివిలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌సి నుంచి పాఠశాలలకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోట్స్‌బుక్స్, ప్రోగ్రెస్ కార్డులు నమోదు చేసిన స్టాక్ రిజిష్టర్‌ను, పాఠ్యపుస్తకాల స్టోర్‌రూమ్‌ను, సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఇప్పటి వరకూ 51అడ్మిషన్లు, కాలేజీలో 32అడ్మిషన్లు పూర్తయ్యాయని 15వ తేదీనాటికి అన్ని తరగతుల్లో అడ్మిషన్లు పూర్తి చేసేలా బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎస్ఒ భవాని, కురవి ఎస్ఒ సరస్వతి, పిఇటి వసంతం, కరుణ, జయమ్మ, సిఆర్‌టిలు పాల్గొన్నారు.

## సాగులో ఆధునిక సాంకేతిక యాంత్రీకరణను ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** సాగులో ఆధునిక సాంకేతిక యాంత్రీకరణ ప్రో త్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని నూతన జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర ని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టి కురవికి వచ్చిన విజయచంద్రని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారితో మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా కఠినమైన విధానాలను పాటించాలని,సాగులో ఆధునిక, సాంకేతిక పద్ధతుల అవలంబించే విధంగా, పంట మార్పిడి విధానం,ఉద్యానవన పంటల సాగుపై రైతులను మళ్లించి అధిక ఆదాయం పొందే విధంగా విధానాలను రూపొందించిజిల్లాను అగ్రగామిగా ఉండేటట్లుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరసింహారావు, ఏ ఏ ఓ లు రాజేశ్వరి, విజేయేందర్, జితేందర్ పాల్గొన్నారు.

## మంత్రి సీతక్క చొరవతో అంగన్వాడీ పోస్టుల భర్తీ

**ప్రజాపక్షం/మంగపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో మంత్రి ధనసరి సీతక్క కృషి చొరవతో రాష్ట్రంలో దశాబ్ద కాలంగా ఖాళీగా ఉన్న అంగన్వాడి టీచర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసినట్లు జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్టి కాలనీ గ్రామంలో పునరుద్ధరించిన అంగన్వాడి కేంద్రాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు అంగన్వాడీ టీచర్లతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఖాళీగా ఉన్న అంగన్వాడి టీచర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిందని త్వరలోనే అంగన్వాడి కేంద్రాల ఆయా పోస్టులను తమ ప్రభుత్వం భర్తీ చేస్తుందని సాంబశివరెడ్డి తెలిపారు. మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టితో ఐ సి డి ఎస్ లో మరిన్ని పథకాలు సేవా కార్యక్రమాలు రాబోతున్నాయని ఆయన తెలిపారు. మహిళా భద్రత శిశు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు ములుగు జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా మంత్రి సీతక్క సహకారంతో అంగన్వాడీలు ఆధునికరించబడు తున్నాయని సాంబశివరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చే బాల బాలికలకు ప్రభుత్వం నుంచి అందించే మెనూ పౌష్టికాహారాన్ని సమర్థవంతంగా అందించాలని, స్థానిక అంగన్వాడి టీచర్లకి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్కీ వెంకన్న, స్థానిక అంగన్వాడి టీచర్ లక్ష్మీ సుమలత, జక్క వజ్రం స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షులు షేక్ మోయినుద్దీన్, ధూళిపాల బాలకృష్ణ, డబ్బుల లక్ష్మయ్య, దొడ్డ భాస్కర్ స్థానిక గ్రామస్తులు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మంగపేట వర్కింగ్ జర్నలిస్ట్ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండల ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ కమిటీ ఎన్నిక గురువారం మండల కేంద్రం లో రైతు వేదిక భవన్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మండల వర్కింగ్ ప్రింట్ మీడియా అధ్యక్షుని గా కటుకూరి సాంబశివ రావు (నవ తెలంగాణ), ప్రధాన కార్యదర్శి గా ఇప్పలపల్లి రమేష్ (వి 6 వెలుగు) ఉపాధ్యక్షులు గా జానపట్ల జయరాజు (తెలంగాణ క్రాంతి), కోశాధికారి గా ఉగ్గుమల్ల గణేష్ (కానుక ), ప్రచార కార్యదర్శి గా తాళ్లూరి మధుకర్ (ప్రజాపక్షం)గౌరవ సలహాదారులు గా ధర్మపురి శ్రీనివాస్ (సాక్షి ), పోలసాని శ్రీనివాస్ రెడ్డి (విశాల తెలంగాణ ), ఈసంపల్లి సురేందర్ (డిడి 9వార్త ), మైపా శంకర్ (పీపుల్స్ ఎన్ కౌంటర్ ) పరికి శ్రీనివాస్ (ఆర్గాన్ న్యూస్ )లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం మీడియా మిత్రులు మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సమస్యల సాధన కోసం కృషి చేస్తామని అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ కార్డ్స్ హెల్త్ కార్డ్స్ ప్రభుత్వం అందించే ప్రతి పథకం వర్కింగ్ జర్నలిస్ట్ లకు అందే విదంగా మీడియా తరుపున పోరాడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు స్నేహ కుమార్ గద్దం ప్రశాంత్ అజరుద్దీన్ యాసం హరీష్ కోడెం నరేష్ బోడ ప్రవీణ్ చిట్యాల రాజశేఖర్,అచ్చ మహేష్, నూతి వెంకటేశ్వర్లు, సామల సాంబాశివరావు, గుగ్గిళ సురేష్ పాల్గొన్నారు.



## అధికారుల సేవలు ప్రశంసనీయం

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో సుదీర్ఘకాలం పని చేసి ప్రజలకు ఉత్తమ సేవలందించిన అధికారుల పని తీరు ఎంతో ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ రాహుల శర్మ అన్నారు. గురువారం బదిలీపై ఇతర జిల్లాలకుబదిలీపై వెళ్లిన జిల్లా రవాణ శాఖ అధికారి మహమ్మద్ సంధాని, క్వాలిటీ కంట్రోల్ ఈఈగా వెళ్లిన భూపాలపల్లి డివిజన్ ఈఈ బసవ ప్రసాద్ గౌడ్, పరకాల ఉద్యాన అధికారిగా నియమితులైన జిల్లా ఉద్యాన అధికారి సునీల్ కుమార్ లను ఇల్లందు క్లబ్ హౌస్ లో ఘనంగా సన్మానించారు. జిల్లా ఉన్నతాధికారులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న అధికారులను శాలువాలతో సన్మానించి, వారి సేవలను కొనియాడారు. జిల్లాలో విధులు నిర్వహించిన కాలంలో వారు అందించిన సేవలు విశేషమైనవని, ప్రజల సమస్యల పరిష్కారంలో చూపిన నిబద్ధత ప్రశంసనీయమని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ తమ కొత్త బాధ్యతల్లో అదే విధమైన కృషి కొనసాగించాలని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అధికారులు తమ సేవా కాలంలో సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బదిలీపై వెళ్లిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.



## అభివృద్ధి చేయమని అంటే... అబండాలు వేస్తారా?

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భూపాలపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలని అడిగితే... సమాధానం చెప్పాల్సింది పోయి అబండాలు వేస్తారా...? బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీష్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు సెగ్గం సిద్దు అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అర్బన్ మాజీ అధ్యక్షుడు కటకం జనార్ధన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గల హరీష్ రెడ్డి, సెగ్గం సిద్దు లు మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది తమ నాయకుడు, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డినే అన్నారు. తమ నాయకుడు గండ్ర వెంకటరమణారెడ్డి భూపాలపల్లి లో పెండింగ్లో ఉన్న పనులను విలేకరుల సమావేశం ద్వారా జనాలకు తెలియజేస్తే, మీరెందుకు ఉలిక్కి పడుతున్నారన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తీసుకువచ్చిన నిధులు అభివృద్ధి పనులను గత 30 నెలలుగా ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. సిఎస్ఆర్ నిధులతో అంబేద్కర్ జంక్షన్ నుండి కెటికెటి లైన్ వరకు నాలుగు లైన్ల రోడ్డు తో పాటు సెంట్రల్ లైటింగ్కు నిధులు తీసుకువచ్చి పనులు ప్రారంభించి చేపిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక కుట్రపూరితంగా ఆ పనులను ఎందుకు ఆపివేశారు తెలపాలని డిమాండ్ చేశారు. ఆ పనులను ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంలో అర్థం ఏమిటో తెలపాలన్నారు. ఈ సమావేశంలో టీబీజీకే ఎస్ భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, కౌన్సిలర్లు మోతె రాజు పటేల్, భోగం నరేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జక్కం రవికుమార్, ముంజంపల్లి మురళీధర్, పిల్లలమర్రి నారాయణ, సదానందం కట్టా నరసింహ చారి, జ్యోతుల వెంకన్న, తిరుపతి, మనోహర్, రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

**ప్రజాపక్షం/మంగపేట:** మండలంలో తిమ్మంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిలకమర్రి రాజేందర్ అక్క పల్నాటి రాములమ్మ ఇటీవలే మృతి చెందగా గురువారం వారి స్వగృహంలో జరిగిన దశదినకర్మలకు హాజరై చిత్రపటానికి పూలువేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు కుదుముల లక్ష్మి నారాయణ మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, పార్టీ సీనియర్ నాయకులు పప్పు వెంకట్ రెడ్డి, కుర్షిద్ అలీ, మలికంటి శంకర్,చీకుర్తి సుధాకర్,పబ్బోజు సత్యనారాయణ చారి, గుడిసెవ నాగేశ్వరావు, చల్లగురుగుల తిరుపతి, పార్టీ నాయకులు, దోమల నర్సయ్య, గంగుల శ్రీనివాస్, సోషల్ మీడియా వారియర్స్ బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూం ఇళ్లకు మోటార్ స్టార్టర్‌ల ఏర్పాటు

**ప్రజాపక్షం/తాడ్వాయి:** తాడ్వాయి మండల పరిధిలోని లింగాల గ్రామ పంచాయతీ పరిధిలో గల కోడిశాల డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద తాగునీటి సరఫరా, మోటార్ స్టార్టర్ రిపేరుకు గురైంది. స్థానిక లబ్ధిదారులు ఈ విషయాన్ని లింగాల గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్య తీవ్రతను గుర్తించిన సర్పంచ్ లబ్ధిదారులకు తాగునీటి ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశ్యంతో తక్షణమే స్పందించి పాత దాన్ని బాగు చేయించే కాలయాపన లేకుండా వెంటనే కొత్త మోటార్ స్టార్టర్‌ను కొనుగోలు చేసి అందజేశారు. సర్పంచ్ సత్వర స్పందన పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు గ్రామ ప్రముఖులు ఊకె రవీందర్, బాలయ్య, సారయ్య, నాగేష్, అశోక్, పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ నర్సరీలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు

**ప్రజాపక్షం/తొర్రూరు :** మండలంలోని హరిపిరాల గ్రామ సమీపంలో ఉన్న ఆయిల్ ఫామ్ నర్సరీలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆయిల్ ఫామ్ నర్సరీ వద్దకు వెళ్లారు. నర్సరీ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నాయకులను సిబ్బంది లోపలికి అనుమతించకుండా గేటుకు తాళం వేసి అడ్డుకున్నారు. అధికారుల అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించబోమని సిబ్బంది చెప్పడంతో బీఆర్ఎస్ నాయకులు గేటు ఎదుటే బైఠాయించి నిరసన తెలిపారు. నర్సరీలో జరిగినట్లు చెబుతున్న అక్రమాలకు సంబంధించిన ఫొటోలను ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయ కోణంలో స్పందిస్తూ బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. రైతులకు నాణ్యమైన ఆయిల్ ఫామ్ మొక్కలు అందించాల్సిన నర్సరీల్లో నాసిరకం విత్తనాలు, వర్మికంపోస్టు, మట్టి, ఎరువులు వినియోగించడం వల్ల వేలాది మొక్కలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, ఆయిల్ ఫెడ్ చైర్మన్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి హరిపిరాల, గోపాలగిరి ఆయిల్ ఫామ్ నర్సరీలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించి ఆయిల్ ఫామ్ సాగుపై విశ్వాసం పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ పార్టీ అధ్యక్షులు బిందు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ సభ్యులు అంకూష్, మండల నాయకులు కాలునాయక్, స్వాతి రాజు, విజయ్‌కుమార్, రాజబాబు, రాజు, ఆయిల్ ఫామ్ రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతురాలి చిత్రపటానికి నివాళులు అర్పించిన మాజీ ఎంపి కవిత

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కొల్లాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సురనేని పాపారావు తల్లి సురనేని సుగుణమ్మ ఇటీవల కన్నుమూయడంతో వారి కుటుంబ సభ్యులను మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత పరామర్శించారు. ఈసందర్భంగా సుగుణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన కవిత ఆమె కుటుంబ షభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.సుగుణమ్మ మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ ఆకుటుంబానికి దైర్యం మనోబలాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో యాకయ్య పిన్నింటి సుదాకర్‌రావు, గుర్రం వెంకన్న, లక్ష్మయ్య, ఆళ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జఫర్‌గడ్ మేజర్ గ్రామ పంచాయితి సర్పంచ్ పుల్ల మోహన్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో రూ.11 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో రోజులుగా పద్మశాలి కాలనీలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ప్రతి విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్వాల్ కుమార్, వార్డు సభ్యులు దాసు, రాజు, శివరాజు, సారంగం, మాజీ మార్కెట్ చైర్మన్ బిక్షపతి, ముజీబ్, చందర్, అనిల్, సదయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జనగామ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్,రిజిస్ట్రేషన్ మేళా

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల కోసం ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళా జూన్ 12న శుక్రవారం (నేడు) నిర్వహించడం జరుగుతుందని ఈ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆహార భద్రత అధికారి సీహెచ్ వినీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతు ందన్నారు. రాష్ట్ర ఆహార పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగు తుందన్నారు.

## చెరువు మట్టిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రైతులు చెరువు మట్టిని తమ పొలాలలో చల్లుకుని సద్వినియోగం చేసుకోవాలని ఈరవెన్ను గ్రామ సర్పంచ్ గాదరి కుమారస్వామి అన్నారు. గురువారం మండలంలోని ఈరవెన్ను గ్రామంలోని సాయి చెరువు ఉపాధి హామీ పథకంలో చెరువు పూడిక పనులు చేపట్టారు. గ్రామంలో ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు పనులు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. చెరువు మట్టిని రైతులు వినియోగించుకోవాలన్నారు. చెరువు మట్టిని పొలాలలో పోయడం వలన పంట దిగుబడులు పెరుగుతాయన్నారు.ఫీల్డ్ అసిస్టెంట్ తోట సరిత, కారోబార్ కుమార్, కూలీలు, రైతులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలను అరికట్టాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** ఆరుగాలం కష్టపడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతుకు నష్టం తెచ్చే నకిలీ విత్తనాలను అరికట్టాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ఏఐయుకేఎస్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఎంఆర్‌వో సరస్వతికి వినతిపత్రం అందజేశారు.రైతులకు అవసరమగు పంట రునాలను సకాలంలో అందించి ప్రైవేట్ అప్పుల బారిన పడకుండా రైతాంగాన్ని కాపాడాలన్నారు. ఆపార్టీ నాయకులు ముంజంపల్లి వీరన్న, ఎండీ షరీఫ్, ఎల్లయ్య, పాల్గొన్నారు.

## వంద శాతం పాఠ్యపుస్తకాలు పంపిణీ

**ప్రజాపక్షం/రేగోడు:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ వంద శాతం వచ్చాయని ఎంఈఓ గురునాథ్ గురువారం తెలిపారు పాఠశాలలు ప్రారంభాని ముందే మండలంలో అన్నిపాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు టీచర్ ఆయాల దరఖాస్తులు పంపించామని అన్నారు.

## బోరునీళ్ల లోపం కాదు..మేయింటనెన్స్ లోపమే

### ఎన్‌హెచ్‌ఆర్‌సి రాష్ట్ర కమిటీ సభ్యుడు.ఎండి షమీమ్



**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలకేంద్రంలోని బాలవికాస మినరల్ వాటర్ ప్లాంట్‌లో బోరు నీల్లవల్లే మినరల్ వాటర్ చప్పగా వస్తోందని కమిటీ అధ్యక్షుడు చెప్పడం హాస్యస్పదంగా ఉందని (ఎన్‌హెచ్‌ఆర్‌సి)నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కమిటీ సభ్యుడు,ప్రముఖ సామాజిక కార్యకర్త ఎండి షమీమ్ అన్నారు.బుధవారం వేలేరు మండలకేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.ఇదేగ్రామంలో మరొ క వాటర్ ప్లాంట్ కూడా ఉంది వారు కూడా బోరు నీళ్లే వాడడం జరుగుతోంది ఆనీళ్లు తియ్యగా రుచిగా ఉన్నా యి.మరి బాలవికాస వాటర్ ప్లాంట్‌లోని ఎందుకు చప్పగా ఉంటుంది అని అన్నారు.అంటే సమస్యబోరు నీళ్లది కాదు వాటర్ ప్లాంట్ మేయింటనెన్స్‌లోపమే అసలు కారణమని అన్నారు.ఆర్ ఒ ప్రక్రియలో అసవరమైన మినరల్స్ తొలగిపోతాయి వాటిని మినరలైజర్ ద్వారా తిరిగి కలుపకపోవడం,టిడిఎస్ లేవల్ సరిగ్గా మేయింటేన్ చేయక పోవడం,కార్బోఫిల్టర్,కార్బన్ ఫిల్టర్ సమయానికి మార్చకపోవడం వల్లే నీళ్లు చప్పగా అవుతాయి .బిఐఎస్ సర్టిఫికేషన్ ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ లైసెన్స్, నెలవారి నీటి నాణ్యత పరీక్ష ఇవి తప్పనిసరి నిబంధనలు వీటిని పాటించకపోవడం చట్టవిరుద్ధం గ్రామసర్పంచ్ గారు స్వయంగా దృష్టిపెట్టి తనిఖీ చేయించాలనీ త్వరలో వర్షాకాలం రానున్నది కనుక సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతూ గ్రామస్తుల ఆరోగ్యంతో చెలగాటమాడే హక్కు ఎవరికీ లేదని హెచ్చరించారు.

## ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో

# మోషన్ విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గురువారం ప్రకటించిన ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో హన్మకొండ రాజస్థాన్ కోటా మోషన్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ లు సాధించిన్నట్లు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఎంపీసీ విభాగం లో కంచ ఐశ్వర్య 470 మార్కులకు గాను 468 మార్కులు (హల్ టికెట్ నెంబర్ 2638118058), ఎండి ఫైజాన్ అలీ 468 మార్కులు (హల్ టికెట్ నెంబర్ 2638120441), దొంత సంజన 467 మార్కులు హల్ టికెట్ నెంబర్ (2638118732), ఠాకూర్ శశిర్ సింగ్ 467 మార్కులు హల్ టికెట్ నెంబర్ (2638119545) బైపిసి విభాగంలో పట్కార్ లిఖిత కు 440 మార్కులకు గాను 438 మార్కులు (హల్ టికెట్ నెంబర్ 2638118414) ములుగు సిందూజ 436 మార్కులు (హల్ టికెట్ నెంబర్ 2638119160) నాగపూరి రిషి ప్రియ గౌడ్ 435 మార్కులు (హల్ టికెట్ నెంబర్ 2638120561)సాధించినట్లు వడ్ల కొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు.



ఈ మార్కులు సాధించిన విద్యార్థులను కాలేజీ యాజమాన్యం శాలువా, పుష్ప గుచ్చం ఇచ్చి అభినందించారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీఫలితాలలో అత్యుత్తమ ర్యాంక్ లు సాధించడానికి తోడ్పడిన అధ్యాపకులకు, ప్రిన్సిపాల్ కు, విద్యార్థులను నిరంతరం ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, ప్రిన్సిపాల్ మారపల్లి సమ్మయ్య, కాలేజీ సిబ్బంది సుమన్, అరుణ, మౌనిక, ఉమ, మధు, వంశీ కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు

## బాబా మందిరంలో ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బిర్లా ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బాబా మందిరంలో నిర్వహించిన ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్‌కు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ సిద్ధార్థ 74 మంది భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సుమారు రూ.6,000 విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా రెండుసార్లు ఈ మొబైల్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మందిర ధర్మకర్త, పీఆర్‌వో నిమ్మల శ్రీనివాస్ తెలిపారు.అదేవిధంగా మందిరంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి కూడా భక్తుల నుంచి విశేష ఆదరణ లభించింది. భక్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం తమ లక్ష్యమని



నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్త వెయ్యిగండ్ల రమేష్, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు నవీన్, సుప్రియ, యాదమ్మ, అలాగే మందిర సిబ్బంది రాజు, సాయి కృష్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు. సేవే పరమో ధర్మః అనే భావనతో బాబా మందిరం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వైద్య సేవలు నిరంతరం అందించబడుతున్నాయి.

## జనగామ ఆర్‌టిసి బస్టాండ్‌ను సందర్శించిన ఎండి నాగిరెడ్డి

**ప్రజాపక్షం/జనగామ:** తెలంగాణ ఆర్‌టిసి ఎండి వై నాగిరెడ్డి గురువారం జనగామ ఆర్‌టిసి డిపోను సందర్శించారు. డిపో మేనేజర్ ఉష స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేశారు. బస్టాండ్, డిపో ప్రాంతాన్ని డిఎం కలియ తిరిగారు. బస్టాండ్‌లో వసతులపై ఆరా తీశారు. ప్రయాణికుల్ని బస్సు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయి. ఏఏ రూట్లలో బస్సుల సమస్య ఉంది అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో భద్రత, తాగునీరు తదితర వాటి గురించి ఆరా తీశారు. కొత్తగా విధుల్లో చేరిన డిపో మేనేజర్ పలు విషయాన్ని ఎండి నాగిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. డిపోలు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని వివరించారు.

### డిఎంతో బాధ్యతలు స్వీకరించిన ఉష

జనగామ ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చిన ఉష గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు డిపో మేనేజర్‌కు స్వాగతం పలికారు. పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సత్కరించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించి డిపో మేనేజర్ ఉష ఉద్యోగులతో సమావేశం నిర్వయించి ఇక్కడి బస్సులు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

## మార్నేని లక్ష్మణ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

**ప్రజాపక్షం/ఐనవోలు :** హన్మకొండ జిల్లా ఐనవోలు మండలంలోని కక్కిరాలపల్లి గ్రామ కంటెస్టెడ్ సర్పంచ్ మార్నేని లక్ష్మి– లక్ష్మణ్ రావు ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో హంటర్ రోడ్‌లోని వారి నివాసంలో లక్ష్మణ్ ను కలిసిన ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మనోధైర్యం కనిపిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పోలేపల్లి బుచ్చిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, ఐనవోలు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య, కాంగ్రెస్ నాయకుడు చిలుక రవి తదితరులు పాల్గొన్నారు.

## బాలవికాస వాటర్ ప్లాంట్ కమిటీతో సర్పంచ్ సమావేశం

**ప్రజాపక్షం /వేలేరు :** వేలేరు మండలకేంద్రంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి ఆద్వర్యంలో బాలవికాస వాటర్ ప్లాంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు ఈసంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆగస్టు మాసం వరకు నూతన కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు ప్లాంటుకు సంబందించిన లావాదేవీలు చట్టబద్దంగా ఆడిట్ చేయవలసి ఉందని,ప్రస్తుతం గ్రామపంచాయితీకి చెందిన బావి నీరు ప్లాంట్‌కు అందించడం జరుగుతోంది అవసరమైతే పూర్తి స్థాయిలో నీటిని ఉపయోగింఒచుకోవాలని కోరారు.వాటర్ ప్లాంట్ నిర్వహణ,వాటర్ శుద్ధీ పకడ్బందీగా నిర్వహించాలని అవసరమైతే ప్రజాల ఆరోగాయన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయితీ వారి సహాయసహకారాలు అందించడం జరుగుతోందని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిరి,ఉపసర్పంచ్ కోడూరి శ్రీకర్,కమిటిఅధ్యక్షుడు అయితె శ్రీనివాస్,కమిటీ సభ్యులు,డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఎన్నుకున్న కాంగ్రెస్ శ్రేణులు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝన్సిరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టి అధ్యక్షులు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో మండలంలో ఆయా గ్రామాల నూతన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ శ్రేణులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా లకావత్ తండా డి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షునగాలావుద్య రవి, సీత్య తండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉపేందర్, మన్ పహాడ్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షునిగా దావుల యాకయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన గ్రామ అధ్యక్షులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

**ప్రజాపక్షం/జఫర్గడ్:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తూ నకిలీ విత్తనాలను నియంత్రించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారికి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో అందించడం జరిగింది. అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులను విత్తనాలను ఎంఆర్‌పీ ధరలకే అందిం చాలన్నారు. నకిలీ విత్తనాలను అమ్మకుండా నియంత్రించాలని తెలియజేశారు. రైతు సంఘం నాయకులు నల్ల తీగల శ్రీను, నరసింహం, రవి, హరికృష్ణ, చిరంజీవి, ఎండీ ఖాదర్, పాల్గొన్నారు.

## రూ. 50వేల విరాళం అందజేసిన సర్పంచ్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ బుర్ర మురళీగౌడ్ గురువారం అంబేద్కర్ కమిటి సభ్యులకు రూ. 50వేల విరాళాన్ని అందజేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం గ్రామంలో ఏర్పాటు అభినందనీయమని, తన వంతు సహకారంగా రూ. 50వేలు అందించడం జరుగుతుందని, మునుముందు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.అంబేద్కర్ యువజన సంఘం పెద్దలు లచ్చయ్య, కానుకుంట బాలయ్య, కృష్ణ, బాబు, యాదగిరి, పవన్, తేజ తదితరులు ఉన్నారు.

# సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ నియమాలకు కట్టుదిట్టమైన చర్యలు

కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం / సంగారెడ్డి :** జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలు 2026 ను సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రమైన ,ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిలా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మున్సిపల్ కమీషనర్లు జిల్లా పంచాయతీ అధికారి జడ్పీ సీఈఓ డివిజనల్ పంచాయతీ అధికారులు కాలుష్య నియంత్రణ మండలి పరిశ్రమలు వైద్య ఆరోగ్య పశుసంవర్ధక డీఆర్‌డిఓ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీం కోర్డు ఆదేశాల , రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మన వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్దతిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాలు పట్టణాల్లో ఉత్పత్తి అయ్యే తడి ,పొడి వ్యర్థాలను వేరు చేసి సేకరించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ వ్యర్థాల రవాణా ప్రాసిసింగ్ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని ,బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారివేయడం ,చెత్తను కాల్చివేయడం వంటి చర్యలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో చెత్త పేరుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. భారీ స్థాయిలో వ్యర్థాల ఉత్పత్తి చేసే ఆపార్మెంట్లు ,పరిశ్రమలు వాణిజ్య సముదాయాలు ,విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లను బల్క్ వేస్ట్ జనరేటర్లుగా గుర్తించి వారు నిబంధనలకు అనుగుణంగా వ్యర్థాల నిర్వహణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నియమాల అమలను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోదించేందుకు ప్రత్యేక చర్యల చేపట్టాలని సూచించారు. రోడ్లపై చెత్త లేకుండా పరిశుభ్రతను కాపాడేందుకు నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. మున్సిపాలిటీలు ,గ్రామ పంచాయతీలలో డంపింగ్ యార్డులు వ్యర్థా ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ,మౌళిక వసతుల కల్పనపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అదికారులను ఆదేశించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిచేందుకు చర్యల చేపట్టాలన్నారు.మున్సిపాలిటీలలో ట్రైడ్ లైసెన్స్ పీజులు, ఆస్తి పన్ను వసూళ్ల గత సంవత్సరం వసూళ్ల వివరాలపై మున్సిపల్ కమీషనర్లతో కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియామాలు 2026 ను విజయవంతంగా అమలు చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ,పర్యావరణ పరిరక్షణ పై ప్రజల్లో అవగాహన కల్పించడం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆద్వర్యంలో రూపొందించిన బట్ట సంచులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,ఆడిషనల్ కలెక్టర్ పాండు ఆవిష్కరించారు.

# సిఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం చేసిన ఔట్‌సోర్సింగ్ కార్మికులు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, వివిధ రకాల కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరికి నెలలో ఒకటి తేదిన జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయటంపాటు, ఈ ప్రక్రియ జాప్యం జరుకుండ ఉండటానికి సీనియర్ అధికారికి నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చినందుకు రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో వెలుగునింపినందుకు జిల్లా కలెక్టరేట్‌లో అన్ని శాఖల ఉద్యోగులు సిఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం చేసి ప్రజాప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం అందరికి సకాలంలో జీతాలు చెల్లించటంతో పాటు, ప్రమాదబీమాను 50 లక్షల రూపాయలు ఇవ్వాలని, మృతిచెందిన కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగంలోకి తీసుకోవాలని వెల్లడించారు. సిద్దిపేట జిల్లా ఔట్‌సోర్సింగ్ జెఎసి ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డికి మరోసారి కృతజ్ఞతుల తెలిపారు. ఈకార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ పుల్లగుల్ల రాజిరెడ్డి. జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నమల యాదగిరి, డివిజన్ కార్యదర్శి నవీన్, సాయిబాబ, కేశవ్, పోతుల రాజమల్లు, రామ చంద్రం,డిఈఓ ఆఫీస్ అశోక్. అరవింద్. నాగరాజు, సంతోష్, మమత,లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్రావుపేట గేటు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**ప్రజాపక్షం/కౌడిపల్లి:** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం వెంకట్రావుపేట గేటు వద్ద జాతీయ రహదారి765పై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఓ అధికారి హైదరాబాదు నుంచి మెదక్ వైపు కారులో ప్రయాణిస్తుండగా, వెంకట్రావుపేట గేటు వద్ద నర్సాపూర్ మండలం అహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన చింతల మల్లేశం (46) తన ద్విచక్ర వాహనంపై అహ్మద్‌నగర్ గ్రామం వైపు రహదారి దాటే ప్రయత్నం చేశాడు. కారు అతని వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద తీవ్రతకు వాహనాలు ఎగిరిపడి, వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ డప్పు కుమార్పై ప డ్డాయి. దీంతో కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గా యపడిన కుమార్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మండల విద్యాధికారి తారా సింగ్




**ప్రజాపక్షం/నర్సాపూర్:** నారాయణపూర్‌లో ఘనంగా బడిబాట కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన చేస్తుండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాధికారి తారా సింగ్ అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఎం జడ్‌పిహెచ్‌ఎస్ (బాయ్స్) నర్సాపూర్ పాఠశాల, ఎంపీపీ ఎస్ నారాయణపూర్ పాఠశాలలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణపూర్ గ్రామంలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరిగి, తల్లిదండ్రులను మరియు విద్యార్థులను ప్రత్యక్షంగా కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ కొత్త అడ్మిషన్లను నమోదు చేశారు. ఈ సందర్భంగా మండల విద్యార్థి గారి తారా సింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొంటూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడిబాట కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉచిత సౌకర్యాలు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ఉచిత యూనిఫామ్స్ ఉదయం పౌష్టికాహార బ్రేక్ ఫాస్ట్ రుచికరమైన మధ్యాహ్న భోజనం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తారా సింగ్ తో పాటు పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్య నాయక్, నారాయణపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యులు రవి కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వివాహితపై అత్యాచార యత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి కఠిన కారగార శిక్ష

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** వివాహితపై అత్యాచార పాల్పడిన కేసులో నిందితునికి కఠిన కారగార శిక్ష, 5వేల జరిమాన విధిస్తూ జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్ తీర్పునిచ్చారు. చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామంలో అక్టోబర్ 9, 2020 సంవత్సరంలో బాధితురాలు ఇంట్లోకి మెదుదుల బాలరాజు (40) అక్రమంగా చొరబడి అమె అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. బాధితురాలు గట్టిగా కేకలు వేయటంతో నిందితురాలు అక్కడి నుండి పారిపోయారు. బాధితురాలు చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి స్థాయి విచారం ఆనంతరం కేసు రుజవు కావటంతో సిద్దిపేట జిల్లా న్యాయమూర్తి జయప్రసాద్ గురువారం బాలరాజుకు సంవత్సరం కారగార శిక్షతో పాటు 5వేల జరిమాన విధించారు. ప్యాసిక్యూషన్ పక్షాన ఆత్మరాములు సమర్థవంతంగా వాదనలు వినిపించి సాక్షాలను ప్రవేశపెట్టారు. అప్పటి ఎస్క్ష సాయికుమార్, ప్రస్తుత సిఐ విద్యాసాగర్, ఎస్ఐ చంద్రమోహన్‌ను సిపి రశ్మీ పేరుమాల్ అభినందించారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట :** పెద్ద శంకరంపేట మండల కేంద్రంలోని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ గురువారం లబ్ది దారులకు పంపిణీ చేశారు. గొట్టి ముక్కల గ్రామానికి చెందిన కలాలి కృష్ణవేణి కి రూ. 40 వేల చెక్కు, తలారి ప్రవీణ్ కుమార్ కు రూ. 26 వేల చెక్కును అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ మాట్లాడుతూ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆపద సమయంలో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సేంద్రియ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యచరణ

-భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలి, జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే సహజ వ్యవసాయ పద్దతులను ప్రోత్సహించడం అత్యంత అవసరమని సేంద్రియ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామంలో పోతరాజు బాలరాజ్ రైతు తన నాలుగున్నర ఎకరాల పొలంలో సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పంటలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయంవైపు రైతులు అడుగులు వేయడం అభినందనీయం అన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించడంలో సేంద్రియ వ్యవసాయం కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సేంద్రియ పద్దతుల్లో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో రైతులు మరింత ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తూ సేంద్రియ సాగును విస్తరించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సేంద్రియ పంటలపై రైతులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించి సేంద్రియసాగు విస్తిరణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ సేంద్రియ వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, ఏఓ లావణ్య, సాంకేతిక వ్యవసాయ అధికారి యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారిని సౌజన్య ఉన్నారు.



# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

**ప్రజాపక్షం/నర్సాపూర్:** అడవి సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎఫ్ ఆర్ ఓ దివ్య అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 11వ రోజు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా నర్సాపూర్ అధికారి దివ్య ఆధ్వర్యంలో నర్సాపూర్ అర్బన్ పార్క్ లో వన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. వివిధ పాఠశాలలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రకృతి సంరక్షణ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు ప్లాస్టిక్ నివారణ చెట్ల పెంపకం పై పరిరక్షణ ప్రాముఖ్య గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలి. అదే విధంగా చెట్ల సంరక్షణ నిర్వహించాలని అన్నారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిద్ధిరామ్, సింగ్ ఫారెస్ట్ శిక్షణ ఆఫీసర్ సాయిరాం, రాజమణి, శ్రీధర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, కుంపు మాస్టర్ స్వామి, అర్బన్ పార్క్ సిబ్బంది పాల్గొన్నారు.



# ముగిసిన ఐవివై సిద్ధార్థ నరేన్ క్రికెట్ సమ్మర్ క్యాంపు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్:**సీతారాంపూర్‌లోని ఐవివై ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ) పాఠశాలలో, భగత్‌నగర్‌లోని సిద్ధార్థ పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్రికెట్ క్యాంపు బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు పసుల మహేశ్, ప్రిన్సిపల్ లలిత మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా పాఠశాలలో సమ్మర్ క్యాంపు ప్రారంభించామన్నారు.పాల్గొన్న విద్యార్థులకు యాజమాన్యం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు ప్రధానం చేశారు. ఈ క్యాంపులో పాల్గొన్న క్రికెట్ కోచ్ నరేన్, శివ, ప్రదీప్, పీఈటి సుశీల్, రాకేశ్, మహమ్మద్ ఖాసీమ్ తదితరులు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## టిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

**ప్రజాపక్షం / శంకరపట్నం:**శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఆ పార్టీ నాయకులు చిట్టెంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్, మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జ్ బుడిగే పరశురామ్ గౌడ్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అధినేత కవితమ్మ ఆదేశాలమేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక తెలంగాణ సాధించాల్సిన అవసరం ఉందని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీకి గాయాలు

**ప్రజాపక్షం / శంకరపట్నం :**మండల పరిధిలోని కరీంపేట గ్రామానికి చెందిన జన్నారపు కనకయ్య (65) రోజువారి పనిలో భాగంగా గురువారం తన భార్య నీలమ్మతో కలిసి చెరువుల ఉపాధి హామీ పూడికతీత పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడడంతో కుడికాలు తొంటి భాగం విరిగింది. తోటి కూలీలు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది సతీష్ రెడ్డి, గోపికృష్ణ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందిస్తూ కనకయ్యను కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

## గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

**ప్రజాపక్షం / రామడుగు :**ఉపాధి హామీ కూలీ పనికి వెళ్లిన వ్యక్తి పనిచేసే చోటే కుప్పకూలి మృతి చెందిన సంఘటన మండలంలోని గుండి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మచ్చ లచ్చయ్య తన భార్యతో కలిసి గత నెల రోజులుగా ఉపాధి హామీ కూలీ పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. రోజువారిలాగే గురువారం ఉదయం కూలీ పనికి వెళ్లినచోట గుండెపోటు రావడంతో తోటి కూలీలు వెంటనే 108 కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపే మచ్చ లచ్చయ్య మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇజ్రాయెల్ దేశంలో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇజ్రాయెల్‌లో హోమ్ బేస్డ్ కేర్ గివర్ ఉద్యోగాలకు డిమాండ్ ఉందని, మొత్తం 3500 ఖాళీలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో 90 శాతం మహిళలకు, 10 శాతం పురుషులకు కేటాయించినట్లు తెలిపారు. ఎఎన్ఎమ్ / జిఎన్ఎమ్ /ఎమ్‌పిహెచ్‌డబ్ల్యు / డిప్లొమా ఇన్ పేషెంట్ కేర్ / బిఎస్‌సి నర్సింగ్ విద్యార్హత కలిగి, 25 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం నుండి గుర్తింపు పొందిన భారతీయ అధికార సంస్థ ద్వారా గుర్తింపు పొందిన నర్సింగ్ డిప్లొమా నుంచి శిక్షణ పొంది ఉండాలని, కనీసం 2 సంవత్సరాల నర్సింగ్ అనుభవం, ఇంగ్లీష్ భాషా ప్రాథమిక పరిజ్ఞానం తప్పనిసరి అని, ఎంపికైన వారికి నెలకు సుమారు 5880.02 NIS,2000 యు ఎస్ డి,193,000 వేతనం రెండు సంవత్సరాల ఒప్పందం కాలంతో ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు మరింత సమాచారం కోసం 9440052081, 9440051763, 9440052 5 92, 9440049645 నంబర్లలో సంప్రదించాలని, tomc omglobal@gmail.com మెయిల్ ఐడికి పంపవలసిందిగాజిల్లాఉపాధి కల్పన అధికారి ఆ ప్రకటనలు పేర్కొన్నారు.

## 2028లో అధికారమే లక్ష్యం

### బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి




**ప్రజాపక్షం / గంగాధర :**2028లో జరిగే ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల అవగాహన సదస్సు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. సభ్యత్వ నమోదు ఇంచార్జ్ పన్యాల భూపతి రెడ్డి నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాల లక్ష్యాన్ని పూర్తి చేసి రాష్ట్రంలో నంబర్‌వన్‌గా నిలవాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి సభ్యత్వాలు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాల ఒక ఉద్యానవనం కావాలి

### జిల్లా పరీక్షల-విజ్ఞానశాస్త్ర పర్యవేక్షకుడు వి.హనుమంతు* జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన,బాధ్యతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీవిత్తనం నుండి వృద్ధి వరకు 2026 వాల్ పోస్టర్‌ను గురువారం పెద్దపల్లి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఆవిష్కరించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక సమావేశంలో జిల్లా పరీక్షల,సైన్స్ అధికారి వి.హనుమంతు ఈ పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రకృతిపై ప్రేమను, పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఏక్ పెడ్ మా కే నామ్ అనే అద్భుతమైన సందేశంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆశయాలకు అనుగుణంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి విద్యార్థి కేవలం మొక్కలు నాటడమే కాకుండా,వాటిని వృక్షాలుగా మార్చే వరకు సంరక్షణ బాధ్యతను ఒక కర్తవ్యంగా స్వీకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ మాట్లాడుతూ నేడు నాటే చిన్న మొక్కే రేపటి భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని, ప్రతి పాఠశాల ఒక పచ్చని ఉద్యానవనంగా మారాలన్నదే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మండల విద్యాధికారి టి.సురేంద్ర కుమార్,మండల విద్యాశాఖ అధికారులు డి.లక్ష్మణ్,ఐ.విజయ్ కుమార్ తోపాటు వివిధ స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక





**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో అండర్ 15 బాల బాలికల బాక్సింగ్ ఎంపికలు నిర్వహించారు.ఈ సందర్భంగా వేయింగ్,ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పారా మిలిటరీ జవాన్ బాక్సింగ్ కోచ్ పాదం మహేందర్ వద్ద శిక్షణ పొందుతున్న ,హర్షిత్ పటేల్ 46 49 కేజీల విభాగంలో ,సాహిత్ పటేల్ 30 33 కేజీల విభాగంలోఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పథకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పాదం మహేందర్ తెలిపారు .ఈనెల 13 ,14 తేదీల్లో హైదరాబాద్ లోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నారని పేర్కొన్నారు .ఎంపికైన క్రీడాకారులను జగిత్యాల జిల్లా క్రీడా అధికారి రవికుమార్,జగిత్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాదం మహేందర్ ,కార్యదర్శి గువ్వ శ్రీనివాస్,టిఆర్ఎస్‌వి రాష్ట్ర కార్యదర్శి పాదం తిరుపతి,మాజీ ఎంపిటిసిగోవిందుల లావణ్య జలపతి, పాదం రాజన్న క్రీడాకారులను అభినందించారు.

# దుబాయ్ ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే సత్యం

**ప్రజాపక్షం / చొప్పదండి:** దుబాయ్‌లోని ఎమిరేట్స్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు వలస కార్మికులు మృతి చెందడం పట్ల చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడుడా.మేడిపల్లి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుబాయ్‌లో లారీ ఆగి ఉండగా వెనుక నుంచి వచ్చిన మినీ బస్సు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మొత్తం 5గురు మృతి చెందగా వారిలో ముగ్గురు తెలంగాణ వారు ఉన్నారు. దుబాయ్‌కు చేరుకున్న మేడిపల్లి సత్యంకు కాంగ్రెస్ ప్రవాస భారతీయుల విభాగం అధ్యక్షుడు డా.ఎస్‌వి రెడ్డి స్వాగతం పలికారు. ఆయనతో పాటు ఎల్లలా సీనన్న సేవా సమితి అధ్యక్షుడు రవి దేవుడ్, డా.బి.ఆర్.అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు నల్లా నర్సయ్య, శ్రీనివాస్, రాజారెడ్డి, సత్యం తదితరులు ఉన్నారు.

## మత్తడి కాలువ పూడికతీత పనులు ప్రారంభం



**ప్రజాపక్షం / చొప్పదండి :** పట్టణ పరిధిలోని కుడి చెరువు మత్తడి నుంచి గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్ వరకు మున్సిపల్ నిధులు రూ.5 లక్షలతో కాలువ పూడికతీత పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరద నీటి కాలువు కూడుకొని పోయి వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు ఇండ్లలోని నీరు వెళుతున్నందున పూడికతీత పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ, మున్సిపల్ కమీషనర్ కె.నాగరాజు, కౌన్సిలర్‌లు కనుమల్ల రాజశేఖర్, వడ్లూరి అనూష శ్యాంసుందర్, రాజన్నల రాజు, గుర్రం రాజేందర్ రెడ్డి, గుర్రం సుజీత్ రెడ్డి, పిట్టల వెంకటేశ్, మొత్తం రాజేశ్వరి గౌడ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేశ్, ఎన్నం అంజయ్య, మున్సిపల్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కోళ్ల ఫారం నిర్మాణంపై అధికారుల విచారణ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం కొనరావుపేట్ గ్రామంలో ప్రతిపాదిత కోళ్ల ఫారం నిర్మాణానికి సంబంధించి ప్రజావాణిలో గ్రామ సర్పంచ్ ఫిర్యాదు చేయడం జరిగినది. అందిన ఫిర్యాదు మేరకు ఎంపిఒ,ఆర్‌ఐలు గురువారం స్థల పరిశీలన నిర్వహించారు. ఫారం నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు తమ అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపాదిత కోళ్ల ఫారం జిల్లా పరిషత్ హైస్కూల్, శివాలయం, కళ్యాణ మండపానికి అత్యంత సమీపంలో ఉండటంతో పాటు, నిర్మాణ స్థలం వద్ద నుంచి 132 కేవీ విద్యుత్ లైన్ వెళ్తోందని తెలిపారు. ఫారం ఏర్పాటు వల్ల దుర్వాసన, కాలుష్యం పెరిగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.విచారణలో సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉప సర్పంచ్ జక్కని పరంధాములు, వార్డు సభ్యులు, వీడీసీ చైర్మన్ మారు సాయిరెడ్డి, వైస్ చైర్మన్ సంకె సంజీవ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొని తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను అధికారులకు వివరించారు. గ్రామస్తుల వాదనలను నమోదు చేసిన అధికారులు సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

## ఆదర్శ పాఠశాల విద్యార్థి రేవతికి మొదటి ర్యాంకు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగం చదువుతున్న మానాల రేవతికి రాష్ట్రంలోనే మొదటి ర్యాంక్ సాధించింది. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను అత్యధికంగా 469 మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్టను రాష్ట్రస్థాయిలో నిలబెట్టింది. రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల ప్రిన్సిపల్ భూమేష్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విద్యార్థిని రేవతి కృషి పట్టుదల అంకితభావమే అత్యధిక మార్కులు సాధించడానికి కారణమని ఆమె భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షిస్తూ అభినందించారు.